# జయం మనదే!

కొన్నాళ్ళ క్రితం ఒక సెమినార్‌కి వెళ్ళాను. అమెరికాలో కొన్ని పెద్ద కంపెనీల్లో మధ్యమధ్యలో ఇలా కొన్ని వ్యక్తిత్వవికాసంకోసం సెమినార్లకి పంపించటం మామూలే. నాకు కూడా ఇలాటివాటికి వెళ్ళినప్పుడు కొన్ని కొత్త విషయాలు తెలుస్తాయనే ఉత్సాహం. అలా వెళ్ళిన సెమినార్‌లలో రకరకాలమంది చెప్పిన విషయాలూ, నేను వేరే పుస్తకాల్లో చదివిన విషయాలూ, అనుభవంతో ఎదురుపడిన సంఘటనలూ కలబోసి క్లుప్తంగా చెబుదామనిపించింది. వాటిల్లో ఇది ఒకటి.

ఒక మనిషి అపజయంతో నిరుత్సాహపడి ఆత్మహత్యకి సైతం సిద్ధమవుతుంటే, ఇంకొక మనిషి భూమి మీద నించీ ఆకాశంలోకీ, అక్కడినించీ అంతరిక్షంలోకీ విజయోత్సాహంతో దూసుకుపెడుతున్నాడు. ఈ అపజయం చూసిన మనిషికి ఇక విజయం రాదా? అందుకనే తన జీవితం చాలించుకుంటున్నాడా? విజయాలు చూసిన మనిషి అపజయం చూడకుండా అంత దూరం వెళ్ళాడా? జయానికీ అపజయానికీ దూరమెంత? దాన్ని తగ్గించవచ్చా? ఎలా? ఇవన్నీ సమాధానాలు వున్న ప్రశ్నలే. కాకపోతే ఈ జరుగుతున్న అనర్థాలకీ, ఆత్మహత్యలకీ కారణం, అందరికీ ఆ సమాధానాల మీద అవసరమైనంత అవగాహన లేకపోవటం అవచ్చు, మనిషిలో సహజంగా వుండే క్షణికోద్రేకత అవచ్చు. ఆ అవగాహన కోసమే చక్కటి పుస్తకాలు చదవటం, ఇలాటి సెమినార్లకి వెళ్ళటం.

ఈ సెమినార్లలో కూర్చున్నంతసేపూ ఎన్నో తెలిసిన విషయాలనే ఒక పద్ధతిలో ఏర్చికూర్చి వాటిలోని మంచీ చెడునీ చూపిస్తారు. ఇక్కడ గమ్మత్తేమిటంటే తెలిసిన విషయాలనే మనకి మళ్ళీ చెబుతున్నట్టు అనిపిస్తుంది. ఎందుకంటే అవన్నీ మనలాటివారి అనుభవాలలోనించే తీసుకునే ఉదాహరణలు కనుక. కాకపోతే కొన్ని క్లిష్ట సమయాల్లో సమస్యల్ని ఎలా ఎదుర్కోవాలనేది తెలియటమే కాక, ఒక విధమైన మోటివేషన్ (ప్రేరణ) కూడా వస్తుంది.

పెట్రోల్ బిజినెస్‌లో కోటీశ్వరుడైన పాల్ గెట్టిని ఎవరో అడిగారు మీరు బిజినెస్‌లో ఇంత గొప్పవారవటానికి కారణం ఏమిటని. దానికి ఆయన ఇచ్చిన సమాధానమేమిటంటే, "నా విజయాలకి నాలుగు సూత్రాలు ఆధారం. వాటిని మనసావాచా పాటించాను. అలాచేస్తే నేనే కాదు ఎవరైనా విజయాలని సాధించవచ్చు" అన్నాడు.

ఆ నాలుగూ సూత్రాలూ ఇవి. మొట్టమొదటగా మీరు సాధించదలుచుకున్న దానిలో ఒక లక్ష్యం (గోల్) పెట్టుకోవటం అవసరం. ఇదికూడా మీ కలలు పండేటంత పెద్దదిగా వుండటం అవసరం అంటాడీయన. ఇలా ఎందుకో కొంచెం ఆగి చెబుతాను. రెండవది ఆ లక్ష్యాన్ని చేరుకోవటానికి ఒక ప్లాన్ తయారుచేసుకోమంటాడు. మీ కలని నిజం చేసేది ఇదే కనుక, కొంచెం ఆలోచించి జాగ్రత్తగా

ఈ ప్లాన్ తయారుచేసుకోమంటాడు. మూడవది, ఏం చేయాలనుకున్నా ఎంతో కొంత త్యాగం చేయాల్సి వస్తుంది కనుక, వాటి లిస్ట్‌కూడా వ్రాసుకుని, వాటిని వదులుకోవటానికి సిద్ధమవమంటాడు. అంటే రోజుకి పధ్నాలుగు గంటలు పని చేయాల్సిరావచ్చు, కుటుంబంతో అనుకున్నంత సమయం గడపలేకపోవచ్చు కొంత ఆదాయం వచ్చేదాకా ఆర్థికంగా ఇబ్బందులు రావచ్చు. ఇలాటివేవైనా సరే ఎదుర్కోవటానికి సిద్ధమవమంటాడు. ఇక నాలుగవది అన్నిటికన్నా ముఖ్య మైనది ఇది. మీకు ఒక లక్ష్యం వుంది అక్కడికి ఎలా చేరుకోవాలో తెలుసు, ఎన్ని కష్టాలుపడటానికైనా సిద్ధంగా వున్నారు... ఇక చేయవలసిందల్లా.. అనుకున్నది చేసి చూపించటం. నైకీ కంపెనీ వాళ్ళు చెప్పినట్టు జస్ట్ డు ఇట్.

ఈ నాలుగవది చాల చాల ముఖ్యం. దీనిమీదే ఇంకొక మంచి పుస్తకం చదివాను. తెలుగులోకి తర్జుమా చేస్తే దాని పేరు,"ఎలా చేయాలో తెలియటానికీ, నిజంగా చేయటానికీ వున్న తేడా" అని. నాకు ఇష్టమైన పుస్తకం. దీనికి సరదాగా ఒక చిన్న ఉదాహరణ చెబుతాను.

అనగనగా ఒక అప్పారావుగారు. ఆయనకి వంటలు చేయటం బాగా తెలుసు అంటారు. వంకాయకూరని ఎన్ని రకాలుగా చేయచ్చో ఇట్టే చెప్పగలడు. ఉల్లిపాయలు మాత్రమే వేసి చేయటం, అల్లం పచ్చిమిరపకాయలూ నూరి ఇంకో రకంగా చేయటం, బాగా కొత్తిమీర దట్టించి ఉల్లిపాయలు లేకుండా చేస్తే ఎంత బాగుంటుందీ, అలాగే గుత్తి వంకాయ కూరనీ ఎన్ని రకాలుగా చేయవచ్చు... ఆయన అవన్నీ ఒక థీసిస్‌లా రాస్తే, ఏ యూనివర్సిటీ వాళ్ళయినాసరే లొట్టలేసు కుంటూ ఆయనకి పి.హెచ్.డీ. ఇస్తారు. (మర్చిపోయాను. పి.హెచ్.డీ. అంటే మా రాముడుగారి అర్థం ఏమిటో తెలుసా? పూర్ అండ్ హంగ్రీ డాక్టర్ అని) కాకపోతే ఈ అప్పారావుగారి భార్య అప్పాయమ్మగారి నడిగితే తెలుస్తుంది. ఈయన వాళ్ళకి పెళ్ళయిన ముప్పై ఏళ్ళల్లోనూ కనీసం మూడు గంటల సేపైనా వంటింట్లోకి రాలేదని. రాలేదంటే రాలేదని కాదు, వంట చేయటానికి రాలేదని. మరివన్నీ ఈయనకి ఎలా తెలుసు? అదే ఆయన గొప్పతనం. అదే, ఎలా చేయా లో తెలియటానికీ... నిజంగా చేయటానికీ వున్న తేడా.

ప్లేన్‌లో ఎక్కగానే సీట్ బెల్ట్ వేసుకోమంటారు. 35వేల అడుగుల ఎత్తుకి వెడుతున్న విమానం కూలిపోతే, ఆ సీట్ బెల్ట్ ఎవర్నీ రక్షించదు. మరి అది వేసుకో వటం ఎందుకు. విమానం కూలిపోతుందనికాదు. సాధారణ పరిస్థితులలో విమానం కూలిపోయేటట్టు ఎవరూ డిజైన్ చేయరు. అలాగే విజయమే లక్ష్యంగా చేసుకున్న మీ ప్లాన్‌కూడా గట్టిగా వుంటుంది. కానీ ఆ విమానం ఎగురుతున్నప్పుడు దారి లో ఎగుడుదిగుడులు (టర్బ్యులెన్స్) వస్తే, ఆ వత్తిడికి దెబ్బలు తగులుతాయని. అలాగే మీ విజయయాత్రలో అడ్డదిడ్డాలకి దెబ్బలు తినకుండా సేఫ్టీ బెల్ట్ వేసుకో వటం అవసరం అంటాడింకో ఆయన.

కలలు కనటం మంచిది కాదని చాలమంది అభిప్రాయం. అలా అనుకో వటం తప్పేకాదు, పురోగమనానికి అడ్డం కూడా. ఎందుకంటే, ఎగిరే పక్షుల్ని

చూసి తనూ అలాగే ఎగరాలని కలలు కన్నాడు మనిషి. ఎగరలేక చితికిల పడ్డాడు. లేచి మళ్ళీ పడ్డాడు. తిరోగమనవాదులు నవ్వుతున్నా ఖాతరు చేయలేదు. తన కలలని నిజం చేసుకోవటానికి అలా లేచినవాడు, పడిన ప్రతిసారీ రెట్టించిన ఉత్సాహంతో లేచి పట్టు విడవకుండా మళ్ళీ ఎగరటానికి ప్రయత్నం చేశాడు. కొద్దిరోజుల్లోనే పక్షులకన్నా ఎత్తుగా వేగంగా ఎగరటం మొదలుపెట్టాడు. ఆకాశంలోనే కాకుండా అంతరిక్షంలోకి కూడా వెళ్ళాడు. చంద్రమండలం మీద సంచారం చేశాడు. ఈనాడు మనచుట్టూ చూస్తున్నవన్నీ ఎవరో ఒకరి కలల ఫలితాలే! కాకపోతే ఆ కలలు, ఏ అర్థ అగర్బాల్‌రోనో పార్కుల్లో కుప్పిగంతులు వేసే తెలుగు సినిమా కథల కలలు కాకుండా వుంటే మంచిది.

మనలో 87 శాతం మంది, తమని తామే తక్కువగా అంచనా వేసుకుంటారని గణాంకాలు చెబుతున్నాయి. ఆ రోజుల్లో శ్రీ ఆంజనేయం ప్రసన్నాంజనేయంగారు కూడా, అందరూ చుట్టూ జేరి నువ్వంతటి వాడివి ఇంతటి వాడివి అని గుర్తు చేస్తే తప్ప, తన శక్తి తను తెలుసుకోలేకపోయాడని గుడివాడ గుడిలో చెప్పేవారు. మరి మానవమాత్రులం మనం ఎంత?

ఇండియానించీ వచ్చిన కొత్తల్లో, నీ శక్తి (స్ట్రెంగ్త్), గొప్పతనాలూ (ఎఛీవ్‌మెంట్స్) చెప్పు నాయనా అని ఇంటర్వ్యూల్లో అడిగితే, కొత్తగా వచ్చిన చాల మంది భారతీయుల్లాగానే నేనూ సిగ్గుపడేవాడిని. ఆఁ! ఏముంది ఇంజనీరింగ్ చదివాను, కొన్నేళ్ళు ఉద్యోగం చేశాను. నాలాటివాళ్ళందరూ చేసేదే. నాదేముంది అనుకునేవాడిని. తర్వాత ముఖమాటపడితే ఏదో అయిందని ఒకానొక రాత్రి ఒక కాగితం కలం తీసుకుని వ్రాయటం మొదలుపెడితే, నేనింత గొప్పవాడినా అనుకునేన్ని వ్రాయగలిగాను. అమెరికాలో మీ స్ట్రెంగ్త్స్, వీక్‌నెస్సులూ చెప్పమని ఎప్పుడూ ఎవరో ఒకరు అడుగుతూనే వుంటారు. నిజాయితీగా చెప్పేవాళ్ళు ముఖమాటపడటం మనవాళ్ళల్లో కనిపిస్తుంది.

ఇక్కడ చెప్పే ఇంకో విషయం, నువ్వు విజయం సాధించాలంటే విజయసారథుల వెంటే తిరుగు అని. ఎలైన్ విత్ సక్సెస్‌ఫుల్ పీపుల్ అని ఇంగ్లీషు పారిభాషికం. నర్సింగ్ రిలేషన్‌షిప్స్, టాక్సిక్ రిలేషన్‌షిప్స్ అని కూడా అంటారు. అంటే పాలు పోసేవాళ్ళూ, విషం పోసేవాళ్ళూ అని కాదు. మనం పరుగెత్తేటప్పుడు చప్పట్లు కొట్టి గెలవమనే వాళ్ళూ, పరుగెత్తేటప్పుడు మన మెడ చుట్టూ డోలు గాళ్ళూ అని.

అమెరికా అంటే రాజకీయపరంగా నచ్చని దేశాల్లో అమెరికన్ ఎంబెసీల ముందు "యాంకీ గో బాక్" అని బోర్డులు చూపించేవారుట. దాని క్రింద కొంత మంది "టేక్ మీ విత్ యూ" అని కూడా వ్రాసేవారుట.

ఏది ఏమైనా, మన మీద మనకి నమ్మకం వుంటే, మన శక్తి మనం తెలుసుకోగలిగితే, మనకి అన్నీ తెలుసుననే అనుకోకుండా ఆ తెలిసినవన్నీ ఆచరణలో కూడా పెట్టగలిగితే... జయం మనదే!

* * *